క్లుప్తంగా

సజావుగా టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ టెట్‌- 2024 పరీక్షలు ఆన్‌లైన్‌లో కొనసాగుతున్నాయి. ఈ నెల 21వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఎచ్చెర్ల శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో బుధవారం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించారు. మొదటి షిఫ్టులో 100 మందికి 88 మంది, రెండో షిఫ్టులో 100 మందికి 87 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పరీక్షలను పర్యవేక్షించారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సుమబిందు

జి.సిగడాం: స్థానిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గర్భిణులకు వైద్యాధికారి పేకల సుమబిందు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. గ్రామస్థాయిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. హెల్త్‌అసిస్టెంట్ పేడాడ సత్తిరాజు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పంచిరెడ్డి ముసలయ్య (85) బుధవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1964 నుంచి 1995 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఈయన మృతి పట్ల ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, పలువురు నాయకులు సంతాపం తెలియజేశారు.

వైష్ణవి దుర్గకు విశేష పూజలు


వైష్ణవీ దుర్గకు పూజలు జరుగుతున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథాలయ క్షేత్ర పాలిక వైష్ణవి దుర్గా దేవికి మూలా నక్షత్రం సందర్భంగా విశేష పూజలు ప్రారంభమయ్యాయి. బుధవారం సాయంత్రం ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, అర్చకులు ఆధ్వర్యంలో మూల పూజలు జరిగాయి. దుర్గాదేవికి విశేష అర్చనలు, విశేష ప్రసాద నివేదన సమర్పించారు. వైష్ణవీ దుర్గదేవి రాత్రివేళ దేవాలయంలో తిరుగుతుందని భక్తుల నమ్మకం. పురాతన కాలం నుంచి మూల పూజలు పేరిట ఆలయంలో ఉత్సవం నిర్వహిస్తుంటారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మణిపాత్రునికి కళానిధి పురస్కారం ప్రదానం


నాగేశ్వరరావుకు అవార్డును అందజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు, కళాకారుడు మణిపాత్రుని నాగేశ్వరరావుకి కళానిధి అవార్డును జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తన చాంబర్లో బుధవారం అందజేశారు. నాగేశ్వరరావు మాస్టారు, చిత్రకళ సంగీతం, తబలా, కవిత్వం, కథా రచన, సంగీత దర్శకత్వం, కళాదర్శకత్వంలలో నిష్ణాతుడైన ఆయన సేవలను గుర్తించిన రోటరీ క్లబ్ ఆఫ్ ఆమదాలవలస వారు ఈ పురస్కారాన్ని కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆమదాలవలస అధ్యక్షులు పల్లె తేజలక్ష్మి, ఎంసీఏ కార్యదర్శి ఎంటీవీ ఆర్ మూర్తి పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు


గాయపడిన ఈశ్వరరావు

శ్రీకాకుళం రూరల్: ద్విచక్ర వాహనం పైనుంచి జారిపడిపోయి వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన పెదపాడు రోడ్డు సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో వజ్రపుకొత్తూరు మండలం పూండి పొల్లాడ గ్రామానికి చెందిన గున్న ఈశ్వరరావు గాయపడ్డాడు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాదర్బార్

శ్రీకాకుళం రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ గణపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొంటారన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే ఆధార్ కార్డుతో పాటు ఫిర్యాదును జతచేసి అందివ్వాలన్నారు.

ఎస్‌ఎంసీల హక్కులకు పాతర

- అభివృద్ధి పనుల్లో కూటమి నాయకులదే పెత్తనం
- పాఠశాల నిర్వహణ కమిటీలను పక్కన పెట్టిన వైనం


గిరివానిపాలెంలో భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

రణస్థలం: మౌలిక వసతుల కల్పనలో, పటిష్టమైన భవన నిర్మాణాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ చేస్తే ఆ పాఠశాల అభివృద్ధి పథంలో నడుస్తోందని భావించి ప్రభుత్వాలు పాఠశాల నిర్వహణ కమిటీలను ఎన్నుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఈ కమిటీల్లోనూ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రాజకీయ జోక్యం పెరిగింది. రణస్థలం మండలంలోని గిరివానిపాలెంలో ప్రాథమికోన్నత పాఠశాలకు న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (అణు విద్యుత్) తరఫున సామాజిక కార్పొరేట్ నిధులు కేటాయించారు. అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.18.50 లక్షలు మంజూరు చేశారు. జీరుకొవ్వాడ, నీలంపేట, నారువ పాఠశాలలకు కూడా ఒక్కొక్క భవనానికి రూ.18.50 లక్షలు కేటాయించారు. మొత్తంగా అణు విద్యుత్ సీఎస్‌ఆర్ నిధులు మండలానికి రూ.74 లక్షలు కేటాయించారు. ఇందులో జీరుకొవ్వాడ భవనానికి స్థలం లేకపోవడం వల్ల నిధులు పెండింగ్‌లో పెట్టారు. ఇంతవరకు బాగానే ఉన్న పాఠశాల అభివృద్ధిలో భాగమైన పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్లకు భవన నిర్మాణ పనులను అప్పగించకుండా కూటమి నాయకుల పెత్తనం చేస్తున్నారు.

ఎస్‌ఎంసీలతో సంబంధం లేని వ్యక్తులకు పనులు..

అర్జునవలసలో ఎస్‌ఎంసీలతో సంబంధం లేని వ్యక్తులు (కూటమి నాయకులు) పనులు చేజించుకోవడంతో గ్రామమంతా చర్చనీయంశమైంది. ఎస్‌ఎంసీలకు కాకుండా ఇతర వ్యక్తులకు బాధ్యతలు ఎలా అప్పగిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కొన్నిచోట్ల పాఠశాల భవనాల్లో నాణ్యత లోపించి కూలిపోతున్న ఘటనలు చాలా చూస్తున్నాం. ఇటీవల మండలంలో పాతర్లపల్లి హైస్కూల్లో నిర్మాణంలో ఉన్న భవనం సన్‌సైడ్ కూలి ఓ విద్యార్థి మృతి చెందాడు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఎక్కడైనా కార్పొరేట్ సంస్థలు తమ సీఎస్‌ఆర్ పనులను కాంట్రాక్ట్ పద్ధతిలో ఎల్‌-1 కాంట్రాక్టర్‌కు (టెండర్లు పిలిచి) అప్పగిస్తారు. కూటమి ప్రభుత్వంలో సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా సామాన్యులకు భవన నిర్మాణ పనులు అప్పగించడం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది.

ఎల్‌-1 కాంట్రాక్టర్‌కు అప్పగించాలి

పాఠశాలల్లో భవన నిర్మాణ పనులు స్కూల్ నిర్వహణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పాఠశాల హెచ్‌ఎంతో సమన్వయం చేసుకుని ఎల్‌-1 స్థాయి కాంట్రాక్టర్‌కు అప్పగించాలి. అలా కాకుండా సామాన్యమైన వ్యక్తులకు నిర్మాణ పనులు అప్పగిస్తే నాణ్యతాప్రమాణాలు దెబ్బతింటాయి.

– మీసాల లక్ష్మీరామునాయుడు, అర్జునవలస సర్పంచ్

కేసులు పెడతామని బెదిరిస్తున్నారు

స్కూల్ నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నన్ను ఎన్నుకున్నారు. కొత్తగా వచ్చిన భవన నిర్మాణ పనులు చేస్తానంటే కూటమి నాయకులు బెదిరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, తామే చేసుకుంటామని అన్నారు. స్కూల్ పరిసర ప్రాంతాలకు వస్తే పోలీసులకు చెప్పి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

– ఆల్తి బాలకృష్ణ, గిరివానిపాలెం స్కూల్ నిర్వహణ కమిటీ చైర్మన్

సర్పంచ్‌కు, ఎస్‌ఎంసీలకు సంబంధం లేదు

గిరివానిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో అదనపు తరగతి గది భవన నిర్మాణానికి అణు విద్యుత్ సీఎస్‌ఆర్ నిధులు రూ.18.40 లక్షలు కేటాయించారు. అందుకే సర్పంచ్‌కు, ఎస్‌ఎంసీకి సంబంధం లేదు.

– సురేష్, ఎస్‌ఎస్‌ఏ జేఈ, రణస్థలం

ఆకట్టుకున్న కోలాటం


హౌసింగ్ బోర్డు కాలనీలోని దుర్గాదేవి వద్ద కోలాటం బృందం


80 అడుగుల రోడ్డులోని దుర్గా మండపంలో భవానీల నృత్యాలు

శ్రీకాకుళం కల్చరల్:

స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద గిరిజ శేషు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జరిగిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. సీతారత్నం, కృపాసాగర్, శ్రీనివాస్ దేవ్, కేబుల్ సాయి, ఉమామహేశ్వరి, భవానీ మాల ధరించిన స్వాములు పాల్గొన్నారు. అలాగే 80 అడుగుల రోడ్డులో ఏర్పాటు చేసిన దుర్గా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి భవానీల భజనలు, అమ్మవారి గీతాలకు నృత్యాలు అలరించాయి. ముందుగా కుంకుమ పూజలు జరిగాయి. భవానీ గురువులు రవి, శివ, బంగారి, రాజేష్‌రెడ్డి, సంప్రదాయం ప్రతినిధులు తరుణ్‌సాయిరెడ్డి, గణేష్‌రెడ్డి, భవానీమాతలు ధనలక్ష్మి, ఆమని పాల్గొన్నారు.

దుర్గమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట


దుర్గమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక తురాయి చెట్టు వీధిలోని దుర్గమ్మతల్లి ఆలయంలో గణపతి, శివుడు, సుబ్రహ్మణ్య స్వామిల స్థిర ప్రతిష్ట మహోత్సవం బుధవారం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ పూజలు చేశారు. అనంతరం నాగావళి నది తీరంలోని వరద గట్టును ఎమ్మెల్యే పరిశీలించారు. వరదల సమయంలో తీసుకుంటున్న జాగ్రత్తలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

రణస్థలం: కరెంట్ బిల్లు వెయ్యి రూపాయలు దాటితే ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనలో భాగంగా సబ్సిడీ ద్వారా అందించే సోలార్‌ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు చాలావరకు తగ్గుతుందని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణమూర్తి అన్నారు. మండలంలోని రణస్థలం సబ్ స్టేషన్ ఆవరణలో పీఎం సూర్య ఘర్ యోజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులతో సోలార్ పథకంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. కిలో వాట్ సోలార్ యూనిట్ విలువ లక్ష రూపాయలని, ఇందులో రూ.30 వేలను ప్రభుత్వమే రాయితీ ఇస్తుందన్నారు. రెండు కిలో వాట్ సోలార్ యూనిట్ విలువ రూ.రెండు లక్షలు ఉంటే రూ.60 వేలు ప్రభుత్వ రాయితీ అని, 3 కిలో వాట్లకు రూ.78 వేలు రాయితీ ఉంటుందన్నారు. రణస్థలం ఏఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేయాలి

ఎచ్చెర్ల క్యాంపస్: కింతలిమిల్లు నుంచి చిలకపాలెం ఫ్లయ్ ఓవర్ వరకు విస్తరించి ఉన్న పాత జాతీయ రహదారి నిర్వహణకు దూరంగా ఉంది. డివైడర్లపై లింగాలపేట, పోలీస్ క్వార్టర్స్ సమీపంలో పిచ్చి మొక్కలు పేరుకు పోయాయి. రోడ్డు పక్కకు పొదలు విస్తరిస్తున్నాయి. పొదల వల్ల పక్క రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు కనిపించటం లేదు. రాత్రులు సైతం ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. పొదలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.


లింగాలపేట సమీపంలోని డివైడర్‌పై విస్తరించిన పొదలు

అధ్వాన రహదారితో అవస్థలు

ఎచ్చెర్ల క్యాంపస్: నవభారత్ కూడలి నుంచి పెయిలవానిపేట, కుంచాలకూర్మయ్యపేట, దోమాం, అఖింఖాన్‌పేట గ్రామాల వైపు వెళ్లే రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారింది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మూడు కిలో మీటర్ల రోడ్డు మరమ్మతుల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ స్థానిక నాయకులు, ప్రజలు తిరుగుతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


రాళ్లుతేలిన రోడ్డు

బూరవెల్లిలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట

గార:

బూరవెల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. అర్చకులు ఆరవెల్లి సీతారామమూర్తి, కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తకంగా పూజలు చేశారు. గ్రామస్తులు, ఉపాధి హామీ వేతనదారులు విరాళాలు సేకరించి విగ్రహాన్ని నెలకొల్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.గణేశ్వరరావు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సరస్వతీదేవికి పూజలు చేస్తున్న భక్తులు

సరస్వతీ నమస్తుభ్యం..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు బుధవారం దర్శనం ఇచ్చారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు తెల్లవారుజాము నుంచే మండపాలు, ఆలయాలకు వెళ్లి సరస్వతీదేవికి పుస్తకాలు, పెన్నులతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే చాలాచోట్ల అక్షరాభ్యాసాలు.. సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశారు.


సరస్వతిదేవిగా బాకర్‌సాహెబ్‌పేట దుర్గామహాలక్ష్మి


సరస్వతీ మాతగా గుడివీధి శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారు


రెడ్డికవీధిలో విజయదుర్గ అమ్మవారి వద్ద సామూహిక పుస్తక పూజలు


పీఎన్ కాలనీలోని జ్ఞానసరస్వతీ ఆలయంలో పూజలందుకున్న సర్వతీదేవి


జి.సిగడాం: కొత్తపెంటలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భవానీ భక్తులు


సంతోషిమాతకు అభిషేకాలు


మొండేటివీధిలో షిర్డీసాయి మందిరంలో స్వతీమాతగా లలితాదేవి


బలగలో బియ్యంపై అక్షరాలు రాయిస్తున్న గణేష్ గురూజీ


శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తురాయిచెట్టువీధిలో దుర్గమ్మను దర్శించుకుంటున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి


శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి ఎంసీపీలో సరస్వతీదేవి పూజల్లో చిన్నారులు


బలగలో సామూహిక అక్షరాభ్యాసాలలో పాల్గొన్న చిన్నారులు


ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట లలితాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న అక్షయ సేవాసమితి ప్రతినిధులు


రణస్థలం: జే.ఆర్.పురంలో దుర్గాదేవి అమ్మవారిని ఊరేగిస్తున్న భవానీ భక్తులు